సాక్షి కామారెడ్డి

గురువారం । 8 । మే । 2025



తడిసిన ధాన్యాన్ని..

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బుధవారం పలు గ్రామాలలో పర్యటించి, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు.

- 10లో ▸



గిట్టుబాటు కాని 'ఉపాధి'

ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలకు కూలి గిట్టుబాటు కావడం లేదు. దీంతో చాలా మంది ఈ పనులపై ఆసక్తి చూపడం లేదు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
41.1 /18.9

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే శిక్షణ'



భిక్కనూరు: మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్సెట్ సంయుక్తంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నాయని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రమీల పేర్కొన్నారు. బుధవారం భిక్కనూరులో స్కిల్ డెవలప్‌మెంట్ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే విధంగా ప్రణాళికలను రూపొందించుకొని, దాని ప్రకారం సాగాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శిరీష, పంచాయతీ ఈవో మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టెర్రరిస్టుల గుండెల్లో దడ



భిక్కనూరు: భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టుల గుండెల్లో దడ మొదలైందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన ఫామ్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పహల్గాంలో అమాయకులైన పౌరులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు మన సైన్యం దీటైన జవాబు ఇచ్చిందన్నారు. యావత్ భారతదేశం మన సైనికుల వెంట ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు విచారణలో నిర్లక్ష్యం

- హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

కామారెడ్డి క్రైం: పాస్‌పోర్టు విచారణలో నిర్లక్ష్యం కనబరిచిన ఓ హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం మద్నూర్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పి.కృష్ణ ఏడాది క్రితం స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వర్తించారు. గతంలో మాచారెడ్డి మండలానికి చెందిన టేకుల రాజయ్య అనే వ్యక్తి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. పాస్‌పోర్ట్ విచారణకు వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ కృష్ణ విచారణలో నిర్లక్ష్యం వహించాడు. టేకుల రాజయ్యకు ఇంతకు ముందు రాజు పేరుతో పాస్‌పోర్టు ఉందన్న విషయం తెలుసుకోకుండా, ప్రాథమిక పరిశీలన లేకుండానే క్లియరెన్స్ ఇచ్చాడు. తర్వాత రాజయ్యపై రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పోలీసు స్టేషన్‌లో నకిలీ పాస్‌పోర్టు కేసునమోదయ్యింది. ఈ విషయం ఎస్పీ రాజేష్ చంద్ర దృష్టికి రావడంతో విచారణ జరిపి ఇన్‌చార్జి డీఐజీ సన్‌ప్రీత్ సింగ్‌కు నివేదించారు. దీంతో హెడ్ కానిస్టేబుల్ పి.కృష్ణను సస్పెండ్ చేస్తూ ఇన్‌చార్జి డీఐజీ ఆదేశాలు జారీ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ క(న)ష్టాలు

మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం) గ్రామ శివారులోని పంట చేల వద్ద ఇటీవల దొంగలు 12 మంది రైతులకు సంబంధించిన బోరుమోటార్ల కేబుళ్లను కత్తిరించుకు వెళ్లారు. ఆ రైతులు బోరులోంచి మోటార్లు బయటకు తీసి కొత్త కేబుల్‌ను జాయింట్ చేసి తిరిగి దించాల్సి ఉంటుంది. వైర్ల దొంగతనం వల్ల రైతులకు కనీసం రూ. 5 వేల నుంచి రూ.10 వేల వరకు నష్టం వస్తోంది.

మహ్మద్‌నగర్ మండలంలో రెండు నెలల క్రితం దొంగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోనుంచి కాపర్ వైర్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ డ్యామేజీతో రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వాటి స్థానంలో కొత్తవి బిగించేదాకా పంటలకు నీరు పారించే పరిస్థితి ఉండదు. దొంగల చర్యలతో విద్యుత్ శాఖతోపాటు రైతులకూ నష్టం వాటిల్లుతోంది.

- ఆయిల్, కాపర్ వైర్ దొంగలిస్తున్న చోరులు
- మోటార్ల వద్దనుంచి స్టార్టర్ల అపహరణ
- విద్యుత్ కేబుల్‌నూ వదలని దొంగలు
- ఇబ్బందిపడుతున్న అన్నదాతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పంట చేల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులో నుంచి కాపర్ వైర్‌ను, ఆయిల్‌ను దొంగిలించడం, అలాగే బోరు మోటార్లకు స్టార్టర్ నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుల్ వైర్లను కత్తిరించి ఎత్తుకెళుతుండడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నపుడల్లా పంటలకు నీరందించడానికి ఆటంకం కలుగుతోంది. అలాగే స్టార్టర్‌లను ఎత్తుకెళ్లడం, కేబుల్ వైర్లను కత్తిరించుకుని పోతుండడం కూడా రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. జిల్లాలో కొన్నేళ్లుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ వైర్లు, స్టార్టర్లు చోరీకి గురవుతున్నాయి. దొంగల ముఠాలను పోలీసులు పట్టుకుని కటకటాల వెనక్కి పంపుతున్నప్పటికీ చోరీలు ఆగడం లేదు.



మహ్మద్‌నగర్‌లో దొంగలు ధ్వంసం చేసి కాపర్ వైర్, ఆయిల్ ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

దెబ్బతింటున్న పంటలు..

వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్‌గా చేసుకుని దొంగలు రాత్రి పూట వాటిని ధ్వంసం చేసి, అందులో ఉండే విలువైన కాపర్ వైర్‌ను అలాగే ఆయిల్‌ను ఎత్తుకెళుతున్నారు. రాత్రి వేళల్లో రైతులు పొలాల దగ్గర ఉండరనే నమ్మకంతో పక్కా ప్రణాళికతో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లపై దాడులకు దిగుతున్నారు. యాసంగిలో వరి పొట్ట దశలో ఉన్న సమయంలో మహ్మద్‌నగర్ గ్రామ శివారులో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. పంటకు నీరందాల్సిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేయడం వల్ల పంటలు దెబ్బతిన్నాయి. ధ్వంసమైన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి కనీసం వారం రోజులైనా పడుతుంది. ఆ సమయంలో నీరందక పంటలు దెబ్బతింటున్నాయి. అలాగే రైతులు కూడా మానసిక క్షోభకు గురవుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. కాగా ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తవి బిగించేదాకా అయ్యే ఖర్చులను కూడా రైతులు మోయాల్సి వస్తోంది. పంటలు దెబ్బతిని ఒక వైపు, అదనపు భారం మీదపడి మరోవైపు రైతులు నష్టాల పాలవుతున్నారు.

రెండు మోటార్ల కేబుల్ ఎత్తుకెళ్లిండ్రు



మాకున్న రెండు బోర్ల కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకపోయిండ్రు. స్టార్టర్ డబ్బా నుంచి మోటారు వరకు ఉన్న కేబుల్ వైరును కత్తిరించి తీసుకపోవడంతో కొత్తది కొనాల్సిన పరిస్థితి. వానాకాలం కోసం తుకం పోయాలంటే వైర్లు వేయాల్సిందే. దొంగలను పట్టుకుని శిక్షించాలి.

– అన్నబోయిన దుర్గయ్య, రైతు, ఘన్‌పూర్(ఎం)

స్టార్టర్ డబ్బాలు పగులగొట్టిండ్రు



దొంగలు స్టార్టర్ డబ్బాలను పగులగొట్టి కేబుల్ వైరు కనెక్షన్ తీసివేసిన తరువాత మోటారు దగ్గర కేబుల్ వైరును కత్తిరించుకుపోయిండ్రు. స్టార్టర్‌కు, మోటార్‌కు మధ్య ముప్పై మీటర్ల మేర ఉండే.. ఎంత లేదన్న ఐదారువేల రూపాయలు నష్టమయ్యింది.

– చల్ల రాజు, రైతు, ఘన్‌పూర్(ఎం)

కేబుల్ దొంగతనాలు...

కొన్నిచోట్ల దొంగలు స్టార్టర్లను, మోటార్ కేబుల్‌ను ఎత్తుకెళుతున్నారు. కేబుల్ తీసుకువెళ్లడంతో మోటారు నడవాలంటే మళ్లీ కొత్త కేబుల్ తెచ్చి బిగించాల్సి ఉంటుంది. వైరు విలువైనది కావడంతో కొనుగోలు చేయడం రైతులకు భారంగా మారుతోంది. ఇటీవల మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం) గ్రామంలో 12 మంది రైతులకు చెందిన కేబుల్ వైర్‌ను దొంగలు కత్తిరించి తీసుకెళ్లారు. అలాగే స్టార్టర్లు కూడా ఎత్తుకెళ్లారు. కేబుల్‌ను కత్తిరించడం వల్ల బోరు వద్ద వైరు లోపలికి పడిపోతోంది. దీంతో తిరిగి కొత్త వైరు ఏర్పాటు చేయాలంటే బోరు మోటార్‌ను పైకి తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కేబుల్ కొనుగోలుకు కనీసం రూ.5 వేల నుంచి రూ.10 వేల దాకా ఖర్చు చేయాల్స వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బోరు నుంచి మోటారు పైకి తీసి, కేబుల్‌కు జాయింట్ వేసి తిరిగి దించడానికి మరో రూ. నాలుగైదు వేలు ఖర్చు అవుతున్నాయంటున్నారు. అంటే ఒక్కో రైతుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా ఖర్చవుతోంది. స్టార్టర్లు కూడా ఎత్తుకెళ్తుండడంతో మరింతగా ఖర్చు అవుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్న, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.



ఘనంగా వాసవి మాత జన్మదిన వేడుకలు



జిల్లాకేంద్రంలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలో బుధవారం వాసవి కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం భక్తిశ్రద్ధలతో కలశాలతో ఊరేగింపు జరిపారు. సిరిసిల్లరోడ్డులోని అమ్మవారి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ నాయకులు ఉత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహంతో పురవీధులలో శోభాయాత్ర నిర్వహించారు.



కలశ యాత్ర ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

అర్హులకే ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న పోచారం, వేదికపై ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే కేటాయించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన ఇందిరమ్మ కమిటీలు, అధికారులతో, సాయంత్రం వర్ని, కోటగిరి, రుద్రూర్, మోస్రా, చందూర్, పొతంగల్ మండలాలకు సంబంధించిన ఇందిరమ్మ కమిటీలు, అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ఉండరాదన్నారు. ఇందిరమ్మ కమిటీలు, అధికారులు గ్రామాల్లో పూర్తి స్థాయిలో విచారణ చేసి రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా అత్యంత నిరుపేదలకు మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, జంగం గంగాధర్, కృష్ణారెడ్డి, నార్ల సురేష్, పిట్ల శ్రీధర్, గురువినయ్, నార్ల రవీందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మెంగారంలో సర్వే చేయొద్దు

లింగంపేట: భూభారతి దరఖాస్తులపై సర్వే చేయవద్దని మెంగారం గ్రామానికి చెందిన రైతులు అధికారులను కోరారు. ఈ విషయమై సర్వే టీం అధికారి రవికుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెంగారం రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 272లో సుమారు 100 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో గ్రామానికి చెందిన రైతులు పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా గ్రామ శివారులోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడానికి లింగంపేట, అయిలాపూర్, కామారెడ్డి గ్రామాలకు చెందిన ఎనిమిది మంది భూభారతిలో దరఖాస్తు చేసుకున్నారని ఆరోపించారు. ఆ ఎనిమిది మంది దరఖాస్తులలో చూపిన భూములను సర్వే చేయవద్దని ఆర్ఐ ప్రదీప్‌ను కోరారు. అలాగే మెంగారం శివారులోని ప్రభుత్వ భూములను అయ్యపల్లి, అయ్యపల్లి తండాకు చెందిన కొందరు అక్రమంగా సాగు చేసుకుంటున్నారన్నారు. వారికి సైతం పట్టాలు ఇవ్వవద్దని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అన్నం సాయిలు, దాసరి సాయిలు, కొమ్ముల రమేశ్, కలాల్ బాలాగౌడ్, బాల సాయిలు, ఎంకొల్ల యాదగిరి, మాసని బాబు తదితరులు ఉన్నారు.



సర్వే బృందంతో మాట్లాడుతున్న గ్రామస్తులు

టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

- కొనుగోళ్లలో వేగం పెంచాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: కొనుగోలు కేంద్రాలను అధికారులు పరిశీలించాలని, అన్ని కేంద్రాల్లో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా చూసుకునేందుకు అవసరమైన టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పౌరసరఫరాలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 35,161 మంది రైతుల నుంచి 2,57,449 మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేశామన్నారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 1,07,343 మెట్రిక్ టన్నులు, సన్నరకం 1,50,106 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు రూ.597.28 కోట్లను రైతులకు చెల్లించామని పేర్కొన్నారు. 9,410 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన 86,331 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యానికి సంబంధించి రూ.43.17 కోట్ల బోనస్ చెల్లించామన్నారు. జిల్లాలో అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. కాంటాలు, హమాలీలను ఎక్కువగా ఏర్పాటుచేసి కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సహకార శాఖ అధికారి రామ్మోహన్, డీఏవో తిరుమల ప్రసాద్, మార్కెటింగ్ అధికారి రమ్య, డీఆర్‌డీవో సురేందర్, ఆర్డీవో వీణ తదితరులు పాల్గొన్నారు.




అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను 14 ఏళ్లలోపు బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వాహకులకు వాలీబాల్, ఫుట్‌బాల్ ఆటలకు సంబంధించిన క్రీడా సామగ్రిని అందించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 10 చోట్ల సమ్మర్ కోచింగ్ క్యాంప్ లను ఏర్పాటు చేశామన్నారు. యువ భారత చాంపియన్లను తయారు చేయడమే లక్ష్యంగా సమ్మర్‌క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ఉపాధి'కి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, ఫాంపాండ్స్ తదితర పనులకు సంబంధించి రెండు రోజుల్లోగా సంబంధిత అధికారులు మండలాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు అవసరమైన భూములను గుర్తించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో మురళి, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఇన్‌చార్జి డీఈవో అశోక్, కామారెడ్డి, బాన్సువాడ పంచాయతీరాజ్ ఈఈలు దుర్గాప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

అకాల వర్షంతో పంటలకు నష్టం



వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



లింగాపూర్‌లో అకాల వర్షానికి కొట్టుకుపోయిన వడ్లు

కామారెడ్డి రూరల్: మండలంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక ఉరుములు, మెరుపులతో కూడిన రాళ్ల వాన కురిసింది. లింగాపూర్, టేక్రియాల్, చిన్నమల్లారెడ్డి, తిమ్మక్‌పల్లి గర్గుల్, ఇస్రోజీవాడి తదితర గ్రామాల్లో కురిసిన అకాల వర్షంతో రైతన్నకు నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చిన ధాన్యం తడిసిముద్దయ్యింది. ఇతర పంటలకూ నష్టం వాటిల్లింది. లింగాపూర్ కొనుగోలు కేంద్రంలో వర్షం నిలిచి కుంటను తలపించింది. బుధవారం ఉదయం పొక్లెయిన్ తీసుకువచ్చి కాలువలు తీసి నీటిని తొలగించారు. కొనుగోలు కేంద్రాల వద్దకు వడ్లు తీసుకువచ్చి 15 రోజులు గడుస్తున్నా తూకం వేయలేదని, దీంతో వర్షంతో నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



లింగాపూర్ కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు



ఈదురుగాలులకు లేచిపోయిన రేకులు



తడిసిన ధాన్యం బస్తాలు

'భూభారతి చట్టం ప్రకారం భూసర్వే చేయాలి'

లింగంపేట: భూభారతి చట్టం ప్రకారం భూ సర్వే చేసి పూర్తి వివరాలను పక్కాగా సేకరించి పరిశీలించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన నల్లమడుగు, పోతాయిపల్లి, మెంగారం గ్రామాల్లో భూభారతి సర్వేను పరిశీలించారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం లింగంపేట వరి కొనుగోలు కేంద్రంను సందర్శించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్ల వివరాలను తెలుసుకున్నారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లోని వడ్లను త్వరగా తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

క్లుప్తంగా

నూతన ఎంపీపీ ప్రారంభం



బాణాపూర్ సబ్‌స్టేషన్‌లో కొత్త ఎంపీఏ ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్రావణ్‌కుమార్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాణాపూర్ సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ(పీటీఆర్)ను బుధవారం ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో 5 ఎంవీఏ(పీటీఆర్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో 8 గ్రామాలకు 24 గంటలు అంతరాయం లేకుండా కరెంటు సరఫరా ఇవ్వడానికి వీలుందన్నారు. అలాగే లోఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి ట్రాన్స్‌కో శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఈ విజయసారథి, ఏడీఈ మల్లేష్, ఇన్‌చార్జి ఏఈ అశోక్, ఎల్ఐ కిష్టయ్య, మాజీ సర్పంచ్ నర్సింలు, మాజీ వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్లౌజులు ధరించి పనులు చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాస్

ఎల్లారెడ్డిరూరల్: విద్యుత్ సిబ్బంది పనులు చేసే సమయంలో గ్లౌజులు ధరించాలని, ఎర్తింగ్ రాడ్‌లను వాడాలని విద్యుత్ శాఖ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఈ శ్రావణ్‌కుమార్, డీఈ విజయసారథి, ఏఈలు, సిబ్బంది తదితరులున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



డోంగ్లీ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న బృందం

మద్నూర్(జుక్కల్): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాయకల్ప బృందం డీసీవో పద్మజ, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి జహీరబేగం అన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కాయకల్ప బృందం అధికారులు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో రోగులకు వైద్యం ఎలా అందుతోందని వారు రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ, సీహెచ్‌వో రాహిజా పర్వీన్, సూపర్‌వైజర్ లక్ష్మీ, ఫార్మసిస్ట్ రాములు, స్టాఫ్‌నర్స్ మంజుల, సిబ్బంది ఉన్నారు.

వేసవి సెలవులు.. పిల్లలు భద్రం..

- చుట్టూ పొంచి ఉండే ప్రమాదాలు..
- జిల్లాలో వెలుగుచూస్తున్న ఘటనలు
- జాగ్రత్తలు పాటించాలని నిపుణుల సూచన



కామారెడ్డి క్రైం: వేసవి వచ్చిందంటే పిల్లలకు పండగే. సరదాగా ఆడుకోవడం తప్ప ఏ ముప్పు ఎలా వస్తుందో, జాగ్రత్తగా ఎలా ఉండాలో తెలియని పసి హృదయాలు వారివి. బోసి నవ్వులు, ఆటలు, కేరింతలతో ఆనందంగా గడవాల్సిన సమ్మర్ హాలీడేస్ కొన్ని కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. చిన్న పిల్లల విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. నిర్లక్ష్యం పనికి రాదని నిపుణులు సూచిస్తున్నారు. ఎల్లవేళలా అప్రమత్తంగా వ్యవహరించడం తప్పనిసరి.

సరదా విషాదం కాకూడదు..

వేసవి కూలర్ల వాడకం ప్రతి ఒంట్లోనూ ఉంటుంది. ప్లాస్టిక్‌తో తయారు చేసే కూలర్ ల కంటే ఇనుప బాడీ ఉండే కూలర్ చల్లటి గాలిని ఇస్తుందని మధ్య తరతి కుటుంబాలకు చెందిన చాలా మంది వాడుతుంటారు. ఐరన్ బాడీ కావడంతో విద్యుత్ షాక్‌లకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిల్లల విషయంలో ఇవి అత్యంత ప్రమాదకరం. కుక్కల బెడద ప్రతి గ్రామం లోనూ ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఇటీవల కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా మారింది. సెలవుల్లో చాలామంది చిన్నారులు సరదా కోసం దగ్గర్లోని చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్తుంటారు. నీట మునిగే ప్రమాదాలు పొంచి ఉంటాయి. జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. 20 రోజుల క్రితం క్యాసంపల్లి శివారులోని ఓ కుంటలో నీట మునిగి ఇద్దరు 14 ఏళ్ల బాలురు మృతి చెందిన ఘటనే ఇందుకు ఉదాహరణ. ఇండ్ల ముందర వాహనాల పార్కింగ్ విషయంలో కూడా జాగ్రత్తలు తప్పనిసరి. రోడ్ల వెంబడి ఆడుకునే చిన్నారులను గమనించకుండా అతివేగంగా వాహనాలు నడిపే వారు కూడా ఉంటారు. మైనర్ డ్రైవింగ్‌కు తల్లిదండ్రులు అవకాశం ఇస్తే కూడా సమస్యలు ఎదురు కావచ్చు. ఇలాంటి కారణాలతో జరిగే ప్రమాదాలకు సంబంధించిన ఘటనలు ప్రతి వేసవి లోనూ వెలుగు చూస్తున్నాయి. వేసవి తాపం విషయంలో కూడా పిల్లలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు..

- జిల్లాలోని రాజంపేట మండలం గుడి తండాలో దారుణం జరిగింది. పిల్లలందరూ కలిసి ఆడుకుంటుండగా ట్రాక్టర్ న్యూట్రల్ గేర్‌లోకి వచ్చి వెనక్కు జరిగింది. ట్రాక్టర్ టైరు వెనుకనే ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పది రోజుల క్రితం ఈ ఘటన ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది.
- ఉమ్మడి జిల్లా పరిధి లోని మాక్లూర్ లో 5 ఏళ్ల బాలుడు ఆడుకుంటూ వెళ్లి అనుకోకుండా ఇనుప కూలర్ ను ముట్టుకున్నాడు. విద్యుత్ షాక్‌కు గురైన బాలుడు అక్కడే చనిపోయాడు. ఐరన్ కూలర్ ల వాడకంతో విద్యుత్ షాక్‌కు గురై చిన్నారులు మృతి చెందిన ఘటనలు గతంలోనూ చూశాం.
- నాలుగు రోజుల క్రితం దేవునిపల్లి లో ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ ఆరేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ముఖం, తొడలపై మాంసం బయటకు వచ్చేలా కరవడంతో బాలుడినిఆస్పత్రిలో చేర్పించారు.
- బాన్సువాడలోఇ ద్దరు చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి బావిలో పడిన విసయం తెలిసిందే. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

అప్రమత్తంగా ఉండాలి



వేసవి సెలవుల్లో పిల్లల సంరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వారిని ఓ కంట కనిపెడుతూనే ఉండాలి. నిర్లక్ష్యంగా వదిలేయకూడదు. ప్రమాదకరమైన వస్తువులు, వాహనాలకు దూరంగా ఉంచాలి. మైనర్ డ్రైవింగ్‌కు అనుమతించకూడదు.

– చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

తడిసిన ధాన్యాన్ని సైతం మిల్లర్లు దించుకోవాలి



తలమడ్లలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేవీఆర్

- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

రాజంపేట: తడిసిన ధాన్యాన్ని సైతం దించుకోవాలని మిల్లర్లకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో అకాల వర్షంతో నష్టపోయిన పంటలను, కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యంను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు పంటనష్టంపై నివేదిక ఇవ్వాలని కోరారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంపత్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, బాలు, రాజిరెడ్డి, చంద్రం, నర్సింలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని వెంటనే కాంటాలు పెట్టాలి

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బుధవారం ఎమ్మెల్యే కేవీఆర్ పరిశీలించారు. మండలంలోని అడ్లూర్, చిన్నమల్లారెడ్డి అకాల వర్షానికి నష్టపోయిన పంటలను, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వర్షానికి తడిసి పోకుండా టార్పాలిన్‌లను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని వెంట వెంటనే కాంటాలు చేయాలన్నారు. హమాలీలను ఎక్కువగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం వడగళ్ల వర్షానికి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవటమే కాకుండా, ఇంకా పంట కోయని పొలాలు, మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు.

నేడు బీకేఎస్ సమావేశం

కామారెడ్డి అర్బన్: లింగాపూర్ సమీపంలోని కొమిరెడ్డి అంజన్న వ్యవసాయ క్షేత్రం వద్ద గురువారం మధ్యాహ్నం 12 గంటలకు భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రతినిధులు, సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి



దోమకొండ రైతు వేదికలో అవగాహన కల్పిస్తున్న ఏవో మణిదీపిక



తాడ్వాయి రైతు వేదికలో..

దోమకొండ/తాడ్వాయి/బీబీపేట : పలు మండలాల్లో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. దోమకొండ రైతు వేదికలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి మణిదీపిక తెలిపారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ నంబరు అందజేయాల్సి ఉంటుందన్నారు. మొబైల్ నంబర్‌కు ఓటీపీ రావడంతో వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధికారికి అందించినట్లయితే 11 అంకెలతో కూడినటువంటి రైతు విశిష్ట సంఖ్య అందజేయబడుతుందన్నారు. బీబీపేట మండలం యడారం క్లస్టర్ లో రైతులకు 11 సంఖ్యలతో కూడిన యూనిక్ కోడ్ ను నమోదు చేసినట్లు యాడారం ఏఈవో సంతోష్ తెలిపారు. తాడ్వాయి రైతు వేదిక కార్యాలయంలో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం కొనసాగిందని వ్యవసాయాధికారి నర్సింలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, కిష్టారెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు




సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్సై

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని శివాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన విషయాన్ని ఎస్సై ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సూచనల మేరకు తాము అన్ని దేవాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించగా బస్వాపూర్ శివాలయంలో ఏర్పాటు చేశారని ఆలయ నిర్వాహకులను అభినందించారు.

సాగర్ అందాలు ఇక కనుమరుగేనా?

- నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాటక ప్రాంతాలను పట్టించుకోని అధికారులు
- అధ్వానంగా మారుతున్న కట్టడాలు



నిజాంసాగర్ ప్రాజెక్టు



నిజాంసాగర్ ప్రాజెక్టులో బోటు షికారు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): నిజాం నవాబు కట్టినటువంటి నిజాంసాగర్ ప్రాజెక్టు చరిత్ర రోజురోజుకు కనమరుగవుతుంది. ఆనాటి కట్టడాలు చెక్కుచెదరకుండా ఉన్నా, ఉన్నతాధికారుల పర్యవేక్ష కొరవడడంతో సరైన నిర్వహణ లేకపోవడంతో మూతపడుతున్నాయి. అప్పట్లో ఎండకాలం వచ్చిందంటే చాలు ప్రజలు ఆహ్లాదం కోసం నిజాంసాగర్ ప్రాజెక్టుకు వచ్చేవారు. ఇప్పుడు నిజాంసాగర్ ప్రాజెక్టు అందాల జాడేదీ అన్నట్లుగా మారాయి.

ప్రాజెక్టుకు ఘన చరిత్ర

నిజాంసాగర్ మండలం అచ్చంపేట, బంజపల్లి గ్రామాల పరిధిలో 1923–31లో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ ప్రధాన ఇంజినీర్ పర్యవేక్షణలో 'ఎస్' ఆకారంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మితమైంది. 1405.05 అడుగులు 30 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించగా 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు, బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ పట్టణాలకు తాగునీరు అందిస్తోంది. ఇంతటి ఘనమైన చరిత్ర కల్గిన నిజాంసాగర్ ప్రాజెక్టు పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.

వేసవిలో పర్యాటక ప్రాంతం..



నీళ్లు లేని ఫౌంటెయిన్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహరాష్ట్ర ప్రాంతాల నుంచి వందలాది మంది పర్యాటకులు నిజాంసాగర్ ప్రాజెక్టుకు తరలివస్తారు. ముఖ్యంగా వేసవి కాలంలో విహారయాత్ర కోసం నిజాంసాగర్ ప్రాజెక్టుకు పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పర్యాటకుల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన సమ్మర్ బాగ్‌తో పాటు స్విమ్మింగ్ పూల్, వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన పర్యాటకులు సమ్మర్ బాగ్‌కు వెళ్లి సమ్మర్‌లో లభించే అన్ని రకాల పండ్లు, కాయల రుచిచూసేవారు. అంతేకాకుండా స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులు స్విమ్మింగ్ చేయడం, వాటర్ ఫౌంటెయిన్ వద్ద సరదాగా సమయం గడిపేవారు. అయితే ప్రస్తుతం సమ్మర్ బాగ్‌లో పండ్ల రకాల చెట్లు అంతరించిపోవడంతో సమ్మర్ బాగ్ పేరు కనుమరుగయింది. అలాగే స్విమ్మింగ్ పూల్, వాటర్ ఫౌంటెన్ ఉన్నా వాటికి నీటి సరఫరా లేకపోవడంతో దశబ్దాల కాలం నుంచి అవి మూలనపడ్డాయి. పర్యాటకులకు ఇక్కడ బోటు షికారు అప్పట్లో అందుబాటులో ఉండేది. జిల్లా అధికారుల అనుమతితో ఇక్కడ బోటు షికారు చేయించేవారు. అయితే కాలక్రమేనా ప్రాజెక్టు వద్ద బోటు షికారు సైతం కనుమరుగైంది. దీంతో పర్యాటకులు సాగర్ అందాలను ఆస్వాదించ లేకపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్టు వద్ద చారిత్రక కట్టడాలను వినియోగంలోకి తీసుకువచ్చి, సందర్శకులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఉన్న ఛత్రీ బంగ్లా

కశ్మీర్‌లో యువ జవాన్ వీరమరణం



వనంజే సచిన్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండలానికి సరిహద్దులోని దెగ్లూర్ తాలుకాలోని తమ్లూర్ గ్రామానికి చెందిన వనంజే సచిన్(29) అనే యువ జవాన్ మంగళవారం కశ్మీర్‌లో వీరమరణం పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. తమ్లూర్ గ్రామానికి చెందిన వనంజే యాదవ్ కుమారుడు సచిన్‌కు 2017లో సియాచిన్‌లో మొదటి పోస్టింగ్ రాగా, ప్రస్తుతం కశ్మీర్‌లో విధులు నిర్వహించేవాడు. ఈక్రమంలో మంగళవారం సచిన్ వీరమరణం పొందినట్లు సమాచారం అందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మద్నూర్‌లో ఈ సమాచారం అందడంతో ప్రతి ఒక్కరు సచిన్ ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ప్రమాదవశాత్తు బాలుడి మృతి

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలోగల ఇటుక బట్టీ వద్ద ఓ బాలుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. ఒడిశా రాష్ట్రానికి చెందిన నిత్య నిరంజన్, మందాకిని దర్వా దంపతులు కొన్ని నెలల క్రితం ఉపాధి నిమిత్తం ముదక్‌పల్లిలోని ఇటుక బట్టీకి వచ్చారు. వారు స్థానికంగా రేకుల గుడిసె వేసుకొని నివాసముంటున్నారు. బుధవారం ఉదయం సుడిగాలి రావడంతో రేకుల గుడిసెపై ఉన్న బండరాళ్లు గుడిసెలో ఉన్న వారి కుమారుడు అభినవ్ దర్వా (5)పై పడ్డాయి. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వెంటనే నిజామాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

అంత్యక్రియలకు వెళ్లి.. అనంతలోకాలకు..

- గోదావరిలో పడి ఒకరి మృతి



మారంపల్లి గంగాధర్(ఫైల్)

నవీపేట: బంధువు అంత్యక్రియలు పూర్తయ్యాక గోదావరి నదిలో స్నానానికి వెళ్లి మరో బంధువు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని అంబేద్కర్ కాలనీకి చెందిన మారంపల్లి గంగాధర్(45) మండలంలోని యంచ గ్రామానికి చెందిన దగ్గరి బంధువు సాయమ్మ అంత్యక్రియలకు మంగళవారం వచ్చాడు. గోదావరి నది ఒడ్డున దహన సంస్కారాలు పూర్తయ్యాక, అతడు నదిలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం గంగాధర్ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సాయిలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీటు కోసం గొడవ.. ఆగిన బస్సు



లింగంపేట(ఎల్లారెడ్డి): బస్సులో సీటు కోసం గొడవ జరిగిన ఘటన లింగంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. లింగంపేట బస్టాండ్‌లో బుధవారం ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న బస్సులో పలువురు మహిళలు ఎక్కారు. బస్సు ఎల్లారెడ్డి వైపు బయలుదేరగా సీటు కోసం పలువురు మహిళలు గొడవ పడ్డారు. మాటా మాటా పెరిగి ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో డ్రైవర్ బస్సును లింగంపేట అంబేద్కర్ చౌరస్తా దాటిన తర్వాత నిలిపివేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చెరుకొని మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాల వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి పంపినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గత నెలలో అదృశ్యమైన ఓ వ్యక్తి, శవమై కనిపించాడు. ఎస్సై రాజయ్య తెలిపిన వివరాలు ఇలా.. తాడ్వాయి మండలం నందివాడ గ్రామ శివారులోని వ్యవసాయ బావివద్ద కుళ్లిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం బుధవారం స్థానికులకు కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రాజయ్య, సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఓ మిస్సింగ్ కేసుకు సంబంధించి కుటుంబసభ్యులను రప్పించారు. వారు మృతదేహాన్ని గుర్తించి, కామారెడ్డి మండలంలోని లింగాపూర్‌కు చెందిన గన్‌సింగ్(45)గా గుర్తించారు. గన్‌సింగ్ గతనెల 13న తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో ఉన్న తమ బంధువుల ఇంటికి వచ్చాడు. కాగా మతిస్థిమితం సరిగా లేని అతడు వచ్చిన రోజే మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య ఫిర్యాదు మేరకు తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో అతడు మృతిచెంది కనిపించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో కుక్కల దాడిలో ఎనిమిది గొర్రెలు, ఒక మేక మృత్యువాత పడ్డాయి. గ్రామంలోని దొడ్ల నవీన్‌కు చెందిన గొర్రెలు, మేకల మందపై బుధవారం వేకువజామున కుక్కలు దాడిచేయడంతో ఎనిమిది గొర్రెలు, ఒక మేక మృతి చెందింది. ఈవిషయమై బాధితుడు వెంటనే ఆర్ఐ బాలయ్యకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

విద్యుత్‌షాక్‌తో మేకలు..

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని శివాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి రెండు మేకలు మృతి చెందినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. గ్రామంలోని చింతల శివరాములుకు చెందిన మేకలు మేత కోసం వెళ్లగా గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో మృతి చెందాయని వారు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్ట పరిహారం అందేలా చర్యలను తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.


విద్యుత్ షాక్‌తో గేదె..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన జోగాయుల మహేష్‌గౌడ్‌కు చెందిన పాడిగేదె బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం మేతకు వెళ్లిన గేదె గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రం వద్ద మేత మేస్తుండగా విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. గేదె విలువ రూ. 60వేలు ఉంటుందని, అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

అక్రమంగా నివసిస్తున్న వారిని అరెస్టు చేయాలి

కామారెడ్డి క్రైం: దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్‌వాసులతోపాటు రోహింగ్యాలను అరెస్టు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడి అనంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా పాకిస్థాన్ వారిని దేశం నుంచి వెళ్ళిపోవాలని కేంద్రం ఆదేశించిందన్నారు. ఈ ఉత్తర్వులను పాటించకుండా దేశంలో అక్రమంగా ఉంటున్నవారిని గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు నేహల్, నాయకులు నరేందర్, వెంకట్, సురేష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారి మారినా పాత పేరే..



మద్నూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బోర్డుపై ఉన్న పేరు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బోర్డుపై పౌర సమాచార అధికారి పేరు తప్పుగా ఉండడంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. పౌర సమాచార అధికారిగా మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి రమేశ్ మార్చిలో బాధ్యతలు చేపట్టారు. కానీ బోర్డుపై గతంలో పనిచేసిన అధికారి శ్రీకాంత్ పేరు ఉండడంతో కార్యాలయానికి వచ్చిన వారు బోర్డును చూసి అవాక్కవుతున్నారు.

చిన్న పోతంగల్‌లో దొంగల హల్‌చల్



గాంధారి: మండలంలోని చిన్న పోతంగల్ గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కొర్రి గౌరవ్వ రాత్రి ఆరుబయట నిద్రించగా వర్షం రావడంతో ఇంట్లోకి వెళ్లింది. కానీ తలుపులకు గడియ వేయడం మరిచిపోయింది. ఇదే అదనుగా ఇద్దరు దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఆమెను కత్తితో బెదిరించారు. నగదు, 12 తులాల వెండి, గౌరవ్వ మెడలో నుంచి బంగారు గుండ్లు లాక్కుని పరారయ్యారు. మరో కాలనీలో ఉండే కుమ్మరి రోజా ఇంటికి తాళం వేసి అదే గ్రామంలోని తన తల్లిగారింటికి వెళ్లింది. ఉదయం ఆమె ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు సమాచారం ఇచ్చారు. ఇంట్లో దాచిన ఏడున్న ర మాసాల బంగారం, 12 తులాల వెండి, కొంతనగదు చోరీకి గురైనట్లు రోజా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనాస్థలాన్ని సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.